నిధులున్నా.. సమకూరని సొంత భవనాలు

- నిర్మాణ పనులకు కాంట్రాక్టర్ల వెనుకంజ
- అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు

శంషాబాద్ రూరల్: కొత్త పంచాయతీలు ఏర్పడి ఐదేళ్లు గడిచినా సొంత భవనాలు సమకూరడంలేదు. పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మరోవైపు రషీద్‌గూడలో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు మంజూరైన స్థలం కేటాయింపులో జాప్యంతో పనులు మొదలు పెట్టడం లేదు. మండలంలోని రషీద్‌గూడ, చౌదరిగూడ పంచాయతీ భవన నిర్మాణాలకు ఉపాధి హామీ పథకంలో రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. గతేడాది పనుల కోసం శంకుస్థాపన చేసి, ఆ తర్వాత పనులు మాత్రం చేపట్టలేదు. ఒకచోట స్థలం సమస్య, మరోచోట పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిర్మాణాలు మొదలు కావడం లేదు.

రషీద్‌గూడలో..

రషీద్‌గూడ పంచాయతీ భవన నిర్మాణం కోసం గ్రామ చౌరస్తా వద్ద ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీంతో గతేడాది జూలైలో శంకుస్థాపన చేసిన తర్వాత పనులు మొదలు పెట్టారు. పిల్లర్ల నిర్మాణానికి తీసిన గుంతల్లో నీళ్లు రావడంతో పనులు ఆపేశారు. ఇప్పటి వరకు ఈ పనులు గుంతలకే పరిమితమయ్యాయి.

ప్రతికూలంగా నేల స్వభావం..

రషీద్‌గూడలో నిర్మిస్తున్న భవనం స్థలం అనువుగా లేకపోవడంతో పనులు నిలిపేసినట్లు తెలిసింది. ఇక్కడ భూమి చాలా లోతు వరకు నీళ్లు వస్తుండటంతో నిర్మాణానికి ప్రణాళికను మార్చాల్సి ఉంటుంది. మట్టిని పరీక్షించిన తర్వాత.. దీనికనుగుణంగా భూమి లోతు నుంచి గట్టిదనం కోసం ప్రత్యేక నిర్మాణంతో భవనం పనులు చేపట్టాలి. ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో చేపడుతున్న ఈ పనుల్లో నిబంధనలు ఇందుకు అనుకూలంగా లేకపోవడం.. పైగా కాంట్రాక్టరు ముందుకు రాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇక మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేపట్టడానికి కాంట్రాక్టరుతో ఒప్పందం కూడా జరిగింది. ఈ నిర్మాణానికి స్థలం కేటాయింపులో జాప్యం జరగడంతో పనులు మొదలు కాలేదు.



రషీద్‌గూడలో పునాదులకే పరిమితమైన పంచాయతీ భవన నిర్మాణం

చౌదరిగూడలో..

చౌదరిగూడలో పంచాయతీ భవన నిర్మాణం కోసం కాంట్రాక్టరు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం నెలకొనడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి జంకుతున్నట్లు సమాచారం.



భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

ద్వాక్రా భవనాల్లో కార్యాలయాలు..

సొంత భవనాలు సమకూరకపోవడంతో ఆయా గ్రామాల్లోని ద్వాక్రా భవనాల్లోనే పంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇరుకుగా ఉన్న గదుల్లో కార్యకలాపాలు చేపట్టడం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధుల మంజూరుతో సమస్య తీరుతుందని భావించినా.. ఎప్పటికి తీరుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తి చేసేలా చూడాలి..



పంచాయతీ భవనం, మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలి. స్థలం కేటాయింపులో ఆలస్యంతో పాటు మొదలు పెట్టిన పనులను కొనసాగించేలా చర్యలు చేపట్టాలి. సొంత భవనం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

– ఎం. రాణిరవి, మాజీ సర్పంచ్, రషీద్‌గూడ

కాంట్రాక్టర్లు ముందుకు రావాలి..

పంచాయతీ భవన నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ముందుకొస్తే పనులు చేపడతాం. రషీద్‌గూడలో నేల స్వభావం నిర్మాణానికి అనుకూలంగా లేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. – యాదగిరిరెడ్డి, ఏఈ పంచాయతీరాజ్

బీజేపీ గడపగడపకు ప్రచారం



ముచ్చింతల్‌లో ప్రచారం చేస్తున్న కొండా సంగీతారెడ్డి

శంషాబాద్ రూరల్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి సంగీతారెడ్డి బుధవారం మండలంలో ప్రచారం చేపట్టారు. ముచ్చింతల్‌లో గడపగడపకు తిరిగి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ.. బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య, సీనియర్ నాయకులు బీర్ల పెంటయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ నరసింహులు

మణికొండ: ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి పూర్తిస్థాయి వైద్య పరీక్షలను నిర్వహించుకుని డాక్టర్ల సలహాలను పాటించాల్సిన అవసరం ఉందని సీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు అన్నారు. బుధవారం కళాశాల చైతన్య స్వాస్థ్య– దివెల్‌నెస్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ క్లబ్‌ల ఆధ్వర్యంలో విజయ డయగ్నస్టిక్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, విజయ డయగ్నస్టిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

మణికొండ: ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. పుప్పాల్‌గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 290లో కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో గండిపేట తహసీల్దార్ నర్రా శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది నాలుగు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ప్రతి అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని హెచ్చరించారు.

ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలి

48 మంది బకాయిదారులకు వారెంట్లు..



రవికుమార్, సర్కిల్ ఉప కమిషనర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోఆస్తి పన్ను చెల్లించని వారు వెంటనే తమ ఆస్తిపన్నును చెల్లించాలని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని 48 మంది మొండి బకాయిదారులకు వారెంట్లను జారీ చేశామన్నారు. మూడు నుంచి ఏడు రోజుల పాటు ఆస్తిపన్ను చెల్లించేందుకు వారికి సమయాన్ని అందించామన్నారు. అయినా చెల్లించకపోతే వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో మొండి బకాయిదారులతో నేరుగా కలుస్తూ.. ఆస్తిపన్నును చెల్లించాలని కోరుతున్నామన్నారు. సర్కిల్ అభివృద్ధికి ఆస్తిపన్ను ఎంతో ముఖ్యమన్నారు. ఐదు డివిజన్ల పరిధిలో నోటీసులను జారీ చేయడంతో వారంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆస్తిపన్నును చెల్లిస్తున్నారన్నారు. నోటీసులు తీసుకుని స్పందించని వారితో తమ అధికారులు, సిబ్బంది నేరుగా వెళ్లి సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. ఆస్తిపన్ను విషయంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఆదివారం కార్యాలయంలో ఆస్తిపన్ను పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 31న పరిష్కార వేదికకు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఆస్తిపన్నును అదే రోజు కార్యాలయంలో నగదు రూపంలో చెల్లించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టు



అరెస్టైన ఏబీవీపీ నేతలు

శంషాబాద్: హైకోర్టు నూతన భవనం శంకుస్థాపన నేపథ్యంలో బుధవారం ఉదయం ఏబీవీపీ నాయకులను ఆర్‌జీఐఏ, శంషాబాద్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వినియోగంలో ఉన్న వర్సిటీ భూములను అప్పగించడాన్ని ఏబీవీపీ జిల్లా నాయకుడు చాకలి మహేష్, ప్రదీప్‌లు ప్రశ్నించారు. ప్రభుత్వానికి విద్యా ప్రయోజనాలు ఏమాత్రం పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టుకు ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపకుండా విద్యార్థులకు వ్యతిరేకంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి కూడా గత ప్రభుత్వానికి పట్టిన గతే పట్టనుందని జోస్యం చెప్పారు.

రాజేంద్రనగర్: హైకోర్టు భవన నిర్మాణ పనుల శంకుస్థాపన నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు విద్యార్థులను ముందు జాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజాము నుంచే నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాదాపు 15 మందిని అదుపులోకి తీసుకుని కార్యక్రమం ముగిసిన అనంతరం విడుదల చేశారు. శంకుస్థాపనను అడ్డుకుంటామని గతంలో ఏబీవీపీ నాయకులు ప్రకటించడంతో ముందస్తుగా విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూనివర్సిటీలోని హస్టళ్లతో పాటు ప్రధాన రహదారులను దిగ్బంధం చేసి శంకుస్థాపనకు వెళ్లే రహదారులను మూసివేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాసీంపాషా (45) అనే వ్యక్తి గత ఆరు నెలల నుంచి పాల్మాకుల శివారులో చిత్తు కాగితాలు ఏరుతూ.. జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం పాల్మాకుల వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా.. శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



రాజశేఖర్ (ఫైల్)

శంషాబాద్ రూరల్: మద్యానికి బానిసైన కుమారుడిని తల్లి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దషాపూర్ తండాకు చెందిన రాజశేఖర్ (27) పనిచేయకుండా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 18న మద్యం తాగి ఇంట్లోనే పడుకుని, పనికి వెళ్లకుండా మద్యం తాగడంతో తల్లి మందలించింది. దీంతో అతడు అదేరోజు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి హెచ్‌సీయూలో ఐఎస్‌ఎల్‌ఈ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో 64వ వార్షిక ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్‌ఎల్‌ఈ) సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు పేపర్ ప్రజెంటేషన్‌లు, ఆరు ప్యానెలిస్ట్ లెక్చర్‌లు, మూడు థీమ్‌ల చుట్టూ పదహారు సమాంతర ప్యానెల్ చర్చలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తారు.ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి 1200 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు. అందులో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సి రంగరాజన్ ప్రారంభోపన్యాసంతో సదస్సును ప్రారంభిస్తారు. ఐఎల్‌ఎస్‌ఈకి చెందిన ప్రొఫెసర్ మైత్రీష్ ఘటక్, జేఎన్‌యూ ప్రొఫెసర్ దీపక్ నయ్యర్, ఐఎల్‌ఓలోని సీనియర్ ఎకనామిస్ట్ ఉమారాణి, ఉపేంద్ర బాక్సీ, లార్డ్ మేఘనాద్ దేశాయ్ వంటి ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు పాల్గొంటారు.

నీటి సరఫరాలో ఇబ్బంది రావొద్దు

అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్



జలమండలి అధికారులతో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ: ప్రజలకు తాగునీటి సరఫరాలో సమస్య రాకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ ఆదేశించారు. బుధవారం ఆమె మణికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో జలమండలి, మున్సిపల్ అధికారులతో నీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో సరఫరా అవుతున్న నీటి వివరాలు, సంపులు, ట్యాంకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. రోజుకు సరఫరా అవుతున్న ట్యాంకర్లకు ఉన్న డిమాండ్, సరఫరాకు పడుతున్న సమయాన్ని అడిగి తెలుసుకున్నారు. డిమాండ్ మేరకు ట్యాంకర్లను ఇటీవలే పెంచామని, ప్రస్తుతం బుక్ చేసుకున్న మరుసటి రోజు సరఫరా చేస్తున్నామని సిబ్బంది తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య లేకుండా, సకాలంలో సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, డీజీఎం శ్రీనారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి



గోల్కొండ: నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారి రాఘవేందర్ అన్నారు. బుధవారం కుల్సుంపురా పార్కులో జలమండలి ఆధ్వర్యంలో నీటి సంరక్షణ–నీటి పొదుపు అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కుల్సుంపురా వాకర్స్ అసోసియేషన్ ఏఆర్‌డీఎస్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీటి పొదుపు నీటి భవిష్యత్తు అవసరాలపై రాఘవేందర్ వివరించారు. ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల నీటిని సంరక్షించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుపై కుల్సుంపురా వాకర్స్ వారు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి స్థానికులందరూ తమ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా నీటిని పొదుపుగా వాడుదామని అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి లైన్‌మెన్ కార్తీక్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీధర్‌సాగర్, జోన్నకుంటి మధుసుధన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం



మజ్లిస్ నాయకులతో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్

గోల్కొండ: నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో నానల్‌నగర్ డివిజన్‌లోని ఒక బస్తీ కూడా ముంపునకు గురి కాదన్నారు. నిజాం కాలనీ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు సాఫీగా ప్రవహించడానికి బాక్స్ టైప్ డ్రైనేజీలు వేశామన్నారు. హకీంపేట్ కుంటలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ పార్కును కూడా అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, సయ్యద్ జబ్బార్, హారూన్‌ఫరాన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్, అబ్బాస్ హుస్సేన్ తదితరులున్నారు.

హెచ్‌సీయూలో ‘సేవ్ లడఖ్ సాలిడారిటీ’

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో ‘సేవ్ లడక్ సాలిడారిటీ ’ పేరిట కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ ప్రతినిధి ధీరజ్ సంఘోజి మాట్లాడుతూ లడక్‌లో నివసించే వారి డిమాండ్‌లకు ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ శాఖ మద్దతు ఇస్తుందన్నారు. ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ కార్యదర్శి లియాకత్ అలీ మాట్లాడుతూ లడఖ్ ప్రజలకు మద్దతుగా నిలబడతామన్నారు.

బస్తీ మీటింగ్

శేరిలింగంపల్లి: పరిసరాల శుభ్రతలో మహిళలు భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఅండ్‌హెచ్‌ఓ నగేష్ నాయక్ తెలిపారు. నల్లగండ్ల వీకర్ సెక్షన్ కాలనీలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో బస్తీ మీటింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ నాయక్ మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో చెత్తను నేరుగా స్వచ్ఛ ఆటోలకే అందించి జీహెచ్‌ఎంసీకి సహకరించాలని కోరారు. స్వచ్ఛ ఆటోలు రాకపోతే తమకు సమాచారం అందించాలన్నారు. రోడ్లపై చెత్త వేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ భరత్, సీఓ శ్రీకాంత్, డ్వాక్రా మహిళలు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో సమ్మర్ స్కూల్ నిర్వహణ

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.17.76 లక్షలు మంజూరు

రాయదుర్గం: సైన్స్ అకాడమీస్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు సమ్మర్ స్కూల్ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అయ్యాయి .ఈ ప్రోగ్రామ్ కింద నిరుపేద విద్యార్థులకు సమ్మర్‌స్కూల్ నిర్వహించడానికి హెచ్‌సీయూలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.17.76 లక్షలు మంజూరు అయ్యాయి. వేసవి పాఠశాలలను నిర్వహించడం ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, సమన్వయకర్తగా ప్రొ.సురేష్ వ్యవహరిస్తారు.

దక్షిణ ఆసియాలోనే ‘ఎస్కీ’ కీలకం



కేలండర్‌ను ఆవిష్కరించిన కౌన్సిల్ సభ్యుడు చౌడేగౌడ, డైరెక్టర్ రామేశ్వరరావు తదితరులు

రాయదుర్గం: దక్షిణ ఆసియాలోనే ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు మంచి గుర్తింపు ఉందని ఎస్కీ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎం చౌడేగౌడ పేర్కొన్నారు. 2024–25 సంవత్సరం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాల వార్షిక కేలండర్‌ను బుధవారం ఆయన డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కీలో 12 శాఖలు ఉన్నాయన్నారు. గత ఏడాది సుమారు ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావు మాట్లాడుతూ పురోగతిలో సాధికారత, ప్రపంచంలోని సవాళ్ళను పరిష్కరించడానికి అభ్యర్థులను సన్నద్ధం చేయడం, నిరంతరం అభివృద్ధి చెందుతున్న అధునాతన ఇంజనీరింగ్, సాంకేతిక రంగాల్లో శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఎస్కీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు కార్యక్రమంలో కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంత రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వైద్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం



రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో బుధవారం అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సూట్ లోగోను సీనియర్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ ఆర్ విజయ్‌కుమార్, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊపిరితిత్తులు, వాయుమార్గాల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీకృతం చేస్తూ ఊపిరితిత్తుల వైద్యంలో ఈ గ్రౌండ్ బ్రేకింగ్ సదుపాయం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ విధానం ద్వారా స్వల్ప ప్రమాదం, ఖచ్చితమైన ప్రయోజనాలను నిర్ధారిస్తుందన్నారు. డాక్టర్ అనురాధ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

వాస్తు పేరుతో ఆక్రమణలు !



మున్సిపల్ కార్యాలయ ఆవరణ స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు



నూతన కార్పొరేషన్ కార్యాలయం భవనం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బాధ్యతలు నిర్వహించిన మహేందర్‌గౌడ్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని ప్రేమ్‌గౌడ్ ఆరోపించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయాన్ని కిస్మత్‌పూర్‌లో నిర్మించే క్రమంలో అక్రమాలు చేస్తూ.. ప్రభుత్వ భూమిని కాజేశారని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం కిస్మత్‌పూర్‌లోని సర్వే నెంబర్ 181లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ స్థలాన్ని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ.. కిస్మత్‌పూర్ సర్వే నెంబర్ 181లో 2.07 గుంటల ప్రభుత్వ భూమిలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. 6 జూన్ 2020లో కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ స్థలాన్ని సర్వేయర్ పూర్తిగా సర్వేచేసి మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించాలని ఆదేశించారన్నారు. సదరు స్థలాన్ని తన చేతుల్లోకి తీసుకున్న మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ మున్సిపల్ కార్యాలయానికి వాస్తు దోషం పేరుతో రెండెకరాల ప్రభుత్వ భూమిలో కేవలం ఒక ఎకరా భూమిలో నిర్మించి మిగిలిన భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. సుమారు రూ.40 కోట్ల విలువ చేసే ఒక ఎకరా స్థలం మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ కబ్జా చేసుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సదరు వెంచర్‌కు వేరొక రోడ్డు ఉన్నా.. వాస్తు పేరుతో మాజీ మేయర్ రోడ్డు మంజూరు చేయించారనే విమర్శిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఏ ఒక్క కార్పొరేటర్ ప్రమేయం లేకుండా తన ఇష్టానుసారంగా ఒంటెద్దు పోకడలతో అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. భవిష్యత్తులో ఆయన చేసిన అక్రమాలన్నింటినీ ఒకొక్కటిగా బయటకు తీస్తామన్నా రు. ఈ మేరకు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలి



తహసీల్దార్ అహల్యకు ఇఫ్తార్ విందు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని గోల్కొండ తహసీల్దార్ అహల్య అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి బుధవారం ఆమెను కలిశారు. నేడు గోల్కొండలో సంఘం ఆధ్వర్యంలో రిసాలబజార్‌లో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు హాజరుకావాలని కోరుతూ ఆమెకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం సంతోషకరమని ఈ సందర్భంగా తహసీల్దార్ అన్నారు. అయితే ఎన్నికల సంఘం యాప్‌లో ఇఫ్తార్ విందు నమోదు చేసుకోవాలని అదే విధంగా గోల్కొండ డివిజన్ పోలీస్ ఏసీపీకి కూడా దరఖాస్తు సమర్పించుకోవాలని ఆమె సూచించారు. గోల్కొండ మహంకాళీ అమ్మవారి ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులు ఉన్నారు.